# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 129వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**
2. **పేదరికాన్ని జయించాలంటే విలువైన ఆయుధం చదువు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా పెదమైనవానిలంకలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు పర్యటించనున్నారు.**
4. **ప్రజా సేవే పరమావధిగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు పనిచేయాలని తెలంగాణ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.**
5. **కళల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

--------------------------

పేదరికాన్ని జయించాలంటే విలువైన ఆయుధం చదువు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. హైదరాబాదులోని ఒక విద్యా సంస్థ వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. గ్లోబల్ నాలెడ్జ్ ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

..వాయిస్..30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా పెదమైనవానిలంకలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా

సీతారామన్ ఈ రోజు పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించనున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సముద్రపు కోత అడ్డుకట్ట పనులను పరిశీలిస్తారని, అనంతరం మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. డ్రోన్, ఏఐ నైపుణ్య శిక్షణ తరగతుల ప్రారంభిస్తారన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తారన్నారు. ప్రజలతో ముఖాముఖిలో పాల్గొంటారని తెలిపారు.

---------------------------

కళల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలో కార్నివాల్ ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి ఏటా ఉగాది పురస్కారాలను అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సాంస్కృతిక వికాసానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి పేర్కొంటూ..

వాయిస్…27 సెకన్లు

---------------------------

ప్రజా సేవే పరమావధిగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు పనిచేయాలని తెలంగాణ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. నిర్మల్ నియోజకవర్గ కేంద్రంలో సర్పంచుల ఆత్మీయ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సర్పంచులను సన్మానించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

---------------------------

దేశ అభివృద్ధి ప్రయాణంలో 2025 సంవత్సరం ఒక నిర్వచనాత్మక అధ్యాయంగా నిలుస్తుంది. 'సంస్కరణల సంవత్సరం'గా నిలిచిన ఈ ఏడాది కాలంలో మౌలిక సదుపాయాల రంగంలో దేశం సాధించిన పురోగతి గురించి ఆకాశవాణి అందిస్తున్న కథనం..

దేశంలో రహదారి, రైలు, విమాన, నౌకా యాన మార్గాల మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజల ఆకాంక్షలకు ఈ ఏడాదిలో వాస్తవ రూపం లభించింది. అత్యంత మారుమూల ప్రాంతల నుంచి దేశంలోని పట్టణ కేంద్రాల వరకూ అనుసంధానం మెరుగుపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం ఖర్చు చేసిన మూలధన వ్యయం 11.21 లక్షల కోట్ల రూపాయలకు పెరగింది. జిడిపిలో ఇది 3.1 శాతానికి సమానం. మిజోరాంను తొలిసారి దేశ రైల్వే నెట్‌వర్క్ కు అనుసంధానించడం జరిగింది. ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టులో భాగంగా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన గా పేరొందిన చీనాబ్ వంతెనను ఈ ఏడాదే ప్రారంభించారు. ఇలా దేశంలో అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ప్రభుత్వం కొన్నింటిని ప్రారంభించడం, మరికొన్నింటిని పూర్తి చేయడం జరిగింది.

---------------------------

జనగణన పూర్తయ్యేవరకూ పునర్విభజన, విలీన ప్రక్రియ చేపట్టకూడదని కేంద్రం ఆదేశించిందని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో నిన్న ఆయన పాత్రికేయులతో

మాట్లాడుతూ.. జనగణన పూర్తైన అనంతరం గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ఏర్పాటు ప్రక్రియ చేపడతామని వెల్లడించారు. ఇప్పటికే కేంద్రం జనాభా సర్వే ప్రారంభించినందున ఈ ప్రక్రియ వెంటనే చేపట్టేందుకు అడ్డంకిగా మారిందని మంత్రి పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రోజు ఆయోధ్య వెళ్లనున్నారు. ఈ ఉదయం హైదరాబాద్ నుంచి బయలు దేరి అయోధ్య కు చేరుకుంటారు. అయోధ్య శ్రీరామ జన్మభూమిలో కొలువైన శ్రీరాముడిని దర్శించుకుంటారు. ఉదయం 11 గంటల 30 నిముషాల నుంచి మధ్యాహ్నం 2 గంటల 30 నిముషాల వరకూ అయోధ్య శ్రీరాముడి సేవలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం అయోధ్య నుంచి బయలుదేరి నేరుగా విజయవాడ రానున్నారు.

---------------------------

ప్రముఖ ధ్వని అనుకరణ కళాకారులు, డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ జయంతి ఈరోజు. నేరెళ్ళ గౌరవార్థం ఆయన పుట్టినరోజు డిసెంబర్ 28ని ప్రపంచ మిమిక్రీ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఎంతోమంది ప్రముఖుల గళాలను  అనుకరించిన నేరెళ్ళ వేణుమాధవ్... తెలంగాణాలోని వరంగల్లో 1932 డిసెంబర్ 28న జన్మించారు. అనేక మందిని మిమిక్రీ కళాకారులుగా తీర్చిదిద్ది, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులుగా సేవలందించారు. ఆయన మిమిక్రీ కళతో పాటు బొమ్మలు మాట్లాడుతున్నట్టు భ్రమింపజేసే వెంట్రి లాక్విజంతోనూ ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకున్నారు.  కళా ప్రపూర్ణతో సహా పలు పురస్కారాలను, భారత ప్రభుత్వ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న నేరెళ్ళ వేణుమాధవ్ 2018 జూన్ 19వ తేదీన తుది శ్వాస విడిచారు.

---------------------------

భారత్ లో శ్రీలంక క్రికెట్ మహిళల జట్టు పర్యటనలో భాగంగా 4వ టి 20 మ్యాచ్ ఈ రోజు కేరళ రాజధాని తిరువనంతపురంలో గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరుగనుంది. రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ లో ఇప్పటి వరకూ జరిగిన 3 మ్యాచ్ లలో భారత్ జట్టు విజయం సాధించి 3-0 ఆధిక్యంతో సిరీస్ ను సొంతం ఇప్పటికే చేసుకుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తాల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే  అవకాశము ఉందని అమరావతిలోని వాతావరణం కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు  పేర్కొన్నారు.

మరోవైపు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. ఎజన్సీ, ఇతర ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల నుంచి 15 డిగ్రీలలోపు నమోదవుతున్నాయి.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అక్కడక్కడా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

======================